క్లుప్తంగా

9వ డివిజన్‌లో మేయర్ పర్యటన

మచిలీపట్నంటౌన్: నగరంలోని 9వ డివిజన్‌లో మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ శుక్రవారం పర్యటించారు. డివిజన్‌లోని కేవీఆర్ పార్కును సందర్శించి వసతులపై ఆరా తీశారు. జవహర్ పబ్లిక్ స్కూల్ సమీపంలో రోడ్డు సమస్యను స్థానికులు మేయర్ దృష్టికి తీసుకువచ్చారు. డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

రూ.లక్ష విరాళం

కోడూరు: కోడూరులో నూతనంగా నిర్మిస్తున్న శివరామకృష్ణ క్షేత్రానికి (శివాలయం) స్థానిక మెడికల్ వ్యాపారి అన్నం వెంకటేశ్వరరావు–శ్యామలాదేవి దంపతులు రూ.లక్ష నగదును విరాళంగా అందించారు. దాతలను దుశ్శాలువాతో సత్కరించారు.

చంద్రశేఖర్‌కు సత్కారం

గూడూరు: కప్పలదొడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాల సైన్స్ మాస్టారు వై.చంద్రశేఖర్‌ను శుక్రవారం గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. చంద్రశేఖర్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా జిల్లా స్థాయి పురస్కారం అందుకున్నారు. సర్పంచి యక్కల మాధవి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు చంద్రశేఖర్ సేవలను కొనియాడారు. యక్కల నాగరాజు, పేరిశెట్టి మధు, రామకోటి, హెచ్ఎం జ్యోతి పాల్గొన్నారు.

11న మండల పరిషత్ సమావేశం

పెడన: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 11వ తేదీ ఉదయం 10.30 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశం హాల్‌లో జరుగుతుందని ఎంపీడీఓ వి. రెడ్డయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగే ఈ సమావేశానికి ఎంపీపీ రాజులపాటి వాణి అధ్యక్షత వహిస్తారని, సభ్యులందరూ హాజరు కావాలని పేర్కొన్నారు.

మెడికల్ విద్యార్థికి సాయం

చిలకలపూడి(మచిలీపట్నం): బందరు మండలం రుద్రవరం గ్రామానికి చెందిన బి. మహేశ్వర్ ఇటీవల నీట్ పరీక్షలో స్టేట్ 1498వ ర్యాంక్‌ను సాధించాడు. మహేశ్వర్‌కు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎంబీబీఎస్ సీటు రావడంతో చదువుకునే స్తోమత లేక ఆర్థిక సాయం కోసం ఎదురుచూస్తున్న సమయంలో మచిలీపట్నానికి చెందిన వైద్యులు లక్ష్మణస్వామి (చిన్నాపురం డాక్టర్) స్పందించారు. విద్యార్థికి ఎంబీబీఎస్ పూర్తయ్యే వరకు ఖర్చును తానే భరిస్తానని హామీ ఇచ్చారు. తల్లిదండ్రులు లక్ష్మణస్వామికి కృతజ్ఞతలు తెలిపారు.

50 మందికి ఫిజియో థెరపీ

మచిలీపట్నంటౌన్: ప్రపంచ ఫిజియో థెరపీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక అమ్మ ఫిజియోథెరపీ క్లినిక్‌లో ఉచిత ఫిజియోథెరపీ శిబిరం నిర్వహించారు. 50 మంది రోగులకు వైద్యుడు ఎల్. ప్రభాకర్ వైద్యసేవలు అందించారు. పలువురు వైద్యులు సహకరించారు.

పెన్షనర్ల వితరణ

మచిలీపట్నంటౌన్: 41వ డివిజన్‌కు చెందిన పింఛనుదారుడు ఇజ్జాడ సత్యనారాయణ ఇటీవల మృతిచెందాడు. డివిజన్‌లోని పింఛనుదారులు ఒక్కొక్కరు రూ. 100 చొప్పున సేకరించిన మొత్తం రూ. 28,650లను సత్యనారాయణ భార్య వీరమ్మకు శుక్రవారం అందజేశారు. 41వ డివిజన్ కార్పొరేటర్ లంకా సూరిబాబు సమక్షంలో ఆమెకు అందజేశారు.

చంద్రబాబు అవినీతిని ఆధారాలతో నిరూపిస్తాం

- ఆధారాలు లేకుండా విమర్శలు చేయం
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

మంగళాపురం(చల్లపల్లి): చంద్రబాబు అవినీతిని ఆధారాలతో నిరూపిస్తామని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. ఆధారాలు లేకుండా వైఎస్సార్ సీపీ ఎప్పుడూ విమర్శలు చేయదని స్పష్టం చేశారు. శుక్రవారం సాయంత్రం మంగళాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే రమేష్‌బాబు గ్రామంలోని ఎస్సీ కాలనీలో 273 ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీల్లో గత పాలకులు దశాబ్దాలుగా రహదారులు నిర్మించలేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అంతర్గత రహదారులు నిర్మిస్తామని తెలిపారు. కరోనా కారణంగా నిలిచిన అభివృద్ధి పనులు పూర్తి చేస్తామన్నారు. చంద్రబాబు అవినీతి లెక్కలు ఒక్కొక్కటిగా బయటకు



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

వస్తుంటే ప్రజలు గమనిస్తున్నారని, రాష్ట్ర ప్రజలు ఈసారి కూడా ఆలోచించి సరైన నిర్ణయం తీసుకుని మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మోపిదేవి ద్వారకానాథ్, తహసీల్దార్ కె.గోపాలకృష్ణ, ఎంపీడీఓ చేకు చిన రాట్నాలు, సర్పంచులు డొక్కు నాగేశ్వరరావు, తోట శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్మన్లు పేరం నాగిరెడ్డి, శీరం నాని, పాగోలు ఫణి, ఎంపీటీసీ నూకల వెంకటేశ్వరరావు, పంచాయతీ ఈఓ సుబ్బారావు, నాయకులు పాల్గొన్నారు.

ఓటీఎస్‌తో లబ్ధిదారులకు సంపూర్ణ హక్కు

గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు

గూడూరు: జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం (ఓటీఎస్) ద్వారా లబ్ధిదారులకు తమ ఇళ్లపై సర్వ హక్కులు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు అన్నారు. గూడూరు పీఏసీఎస్ ఆవరణలోని రైతు కమ్యూనిటీహాల్‌లో శుక్రవారం జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం లబ్ధిదారులకు డాక్యుమెంట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం ఇచ్చిన నివేశన స్థలాల్లో శాశ్వత ఇళ్లు నిర్మించుకుని దశాబ్దాలుగా నివాసం ఉంటున్నా.. వాటిపై రిజిస్ట్రేషన్ హక్కులు లేకుండా పోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. సమస్యను గుర్తించిన జగనన్న సంపూర్ణ గృహ



ఓటీఎస్ లబ్ధిదారుకు రిజిస్టర్డ్ డాక్యుమెంట్ అందజేస్తున్న ఎంపీపీ మధు, తలుపుల కృష్ణ

హక్కు పథకం ద్వారా నామమాత్రపు ఫీజుతో లబ్ధిదారుల పేరిట రిజిస్టర్ డాక్యుమెంట్ జారీ చేశారని చెప్పారు. తద్వారా దస్తావేజులను బ్యాంకుల్లో తనఖా పెట్టుకోవడం, క్రయ విక్రయాలు చేసుకోవడానికి లబ్ధిదారులకు అవకాశం కలిగిందన్నారు. కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ తలుపుల వెంకటకృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ ప్రత్యేక చొరవతో గూడూరు గ్రామంలోని ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ సమస్య పరిష్కారం అయిందని తెలిపారు. అదే విధంగా గ్రామంలోని లబ్ధిదారులందరికీ గతంలో ఇళ్ల స్థలాలు పంపిణీ చేశామని, వాటిపై కొందరు వ్యక్తులు కోర్టుకు వెళ్లడంతో ఇళ్ల నిర్మాణాలు ఆగాయన్నారు. స్థలాల సమస్యపై కూడా మంత్రి చిత్తశుద్ధితో ప్రయత్నం చేస్తున్నారని, త్వరలో లబ్ధిదారులందరికీ స్థలాలు కేటాయించి, సొంతింటి కల నెరవేర్చుతామని చెప్పారు. ఎంపీడీఓ డి.సుబ్బారావు, ఏపీఎస్ఎఫ్‌సీ డైరెక్టర్ కారుమంచి కామేశ్వరరావు, రైల్వే బోర్డు సభ్యుడు మోటేపల్లి రత్నారావు, వైఎస్సార్ సీపీ నాయకులు పర్ణం పెదబాబు, ఫైజుల్ రహ్మాన్, గమిని కృష్ణ, లింగం విజయ్‌కుమార్, కోడే వెంకటేశ్వరరావు, అట్లూరి వెంకటేశ్వరరావు, తహసీల్దార్ బి.విజయప్రసాద్ పాల్గొన్నారు.

వలంటీర్లకు పురస్కారాల ప్రదానం

గూడూరు: సేవా తత్పరతతోనే వలంటీర్లకు గుర్తింపు లభిస్తుందని గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు అన్నారు. మల్లవోలులో వలంటీర్లకు వందనం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు చేర్చాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ల వ్యవస్థకు రూపకల్పన చేశారన్నారు. అమూల్యమైన సేవలు అందిస్తున్న వలంటీర్లపై కొంత మంది రాజకీయ విమర్శలు చేయడం బాధాకరమన్నారు. విమర్శలకు వెనుకడుగు వేయకుండా మరింత పట్టుదలతో సేవలు కొనసాగించాలని సూచించారు. వలంటీర్లకు ప్రభుత్వం ప్రకటించిన పురస్కారాలను అందజేసి వారిని సన్మానించారు. ఏపీఎస్ఎఫ్‌సీ డైరెక్టర్ కారు



వలంటీర్‌ను సన్మానిస్తున్న నాయకులు

మంచి కామేశ్వరరావు, సర్పంచి బొర్రా సాంబశివయ్య, పర్ణం మహాలక్ష్మయ్య నాయుడు, ఎంపీటీసీ సభ్యుడు పిట్ల రామిరెడ్డి, ఎంపీడీఓ డి.సుబ్బారావు, తహసీల్దార్ బి.విజయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక వరలక్ష్మి వ్రతాలు

మచిలీపట్నంటౌన్: బచ్చుపేటలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సుమారు 300 మంది సువాసినీలు పూజలు చేశారు. అలాగే నగరంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా సువాసినిలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సుబ్బారెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు.

కోనేరుసెంటర్: ఎస్ ఎన్ గొల్లపాలెం గ్రామంలోని ఉమా సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

అన్నపూర్ణాదేవికి సారె సమర్పణ



భావదేవరపల్లి(నాగాయలంక): శ్రావణమాసాన్ని పురస్కరించుకుని గ్రామంలోని అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి భక్తులు సారె సమర్పించారు. స్థానిక వ్యాపారి ఉయ్యూరు కామేశ్వరరావు, పద్మలత దంపతులు అమ్మవారికి నూతన వస్త్రాలు, సారె సమర్పించారు. 100 మంది మహిళలు సామూహిక కుంకుమ పూజ నిర్వహించారు. వీరందరికీ దాత కామేశ్వరరావు దంపతులు శ్రీలక్ష్మీ రూపులను బహూకరించారు.

మహిళలను అగౌరవంగా మాట్లాడటం తగదు

కోనేరుసెంటర్: బందరులో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేని టీడీపీ నాయకులు అసందర్భ ప్రేలాపనలు చేస్తుండటం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. టీడీపీ ఐదేళ్ల పాలనలో జరగని అభివృద్ధి రెండేళ్లలోనే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసి చూపిందన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మార్కెట్ యార్డు చైర్మన్ అచ్చేబా మాట్లాడారు. మచిలీపట్నం నగర మేయర్‌గా బీసీ మహిళ ప్రమాణ స్వీకారం చేస్తే అందులోనూ తప్పులు వెతుకుతున్న ఘనత టీడీపీ నాయకులలేనన్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమంలో టీడీపీ కార్పొరేటర్లకు గౌరవం ఇవ్వలేదన్న ఆరోపణల్లో వాస్తవం లేదని చెప్పారు. నియోజకవర్గ కన్వీనర్ మేకల సుబ్బన్న మాట్లాడుతూ బందరు అభివృద్ధి పేర్ని నానికే సాధ్యమని ప్రజలు విశ్వసిస్తుండగా ప్రతిపక్షం చేస్తున్న ఆరోపణలను లెక్కచేసేదే లేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషితో బందరులో వేల కోట్ల ఖర్చుతో మెడికల్ కళాశాల, ఫిషింగ్ హార్బర్, బందరు పోర్టు నిర్మాణ పనులు జరుగుతున్నాయని వివరించారు. నాయకులు శీలం మారుతీరావు, చిటికిన నాగేశ్వరరావు, లంకా సూరిబాబు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఓటర్ల సర్వేలో సమస్యలు తెలియజేయండి

కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): ఫొటో ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమంలో సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ పి. రాజాబాబు రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. ఆయన చాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం సాయంత్రం సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించి నాణ్యమైన ఫొటో ఓటర్ల జాబితా తయారు చేయవచ్చునన్నారు. ఫొటో ఓటర్ల జాబితాలో డబుల్ ఎంట్రీలు నివారించాలని, 80 సంవత్సరాలు దాటిన వయో వృద్ధులు, దివ్యాంగులు ఇంటి నుంచి ఓటు హక్కు వినియోగించుకునే సౌకర్యం కల్పించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ మరణించిన ఓటర్ల పేర్ల తొలగింపునకు, షిఫ్టింగ్ పేర్ల విషయంలో కచ్చితంగా నిబంధనలు పాటించాలన్నారు. షెడ్యూల్ ప్రకారం అక్టోబరు 17వ తేదీ నాటికి ఫొటో ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ డ్రాఫ్ట్ జాబితాలను ప్రచురిస్తామని తెలిపారు. అనంతరం ఫొటో ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు చేసిన జాబితాలు రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. డీఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పర్ణం సతీష్, పడమట రమేష్, గాజుల సిద్ధార్థ, పంతం గజేంద్ర, కొడాలి శర్మ, వంపుగడవల చౌదరి, లింగం ఫిలిప్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

విద్యార్థుల ఉన్నతిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

పెడన మున్సిపల్ చైర్‌పర్సన్ నాగకుమారి

పెడన: విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు ముఖ్యమైన పాత్ర పోషిస్తారని మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అన్నారు. శుక్రవారం పట్టణంలోని 4వ వార్డు ఎంపీయూపీ ఉర్దూ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్ రజాక్ అస్లాం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపికై జిల్లా కలెక్టర్ రాజాబాబు చేతుల మీదుగా అవార్డు అందుకున్న సందర్భంగా పాఠశాలలో అభినందన సభ నిర్వహించారు. నాగకుమారి మాట్లాడుతూ విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపరచడంలో అస్లాం కృషి ఎంతో ఉందని చెప్పారు. సహోపాధ్యాయులు, కౌన్సిలర్ రెహమతున్నీసా, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ బండారు మల్లి, నాయకుడు కోడూరు శ్రీను, హుమాయూన్, నాగబాబు, ఉపాధ్యాయులు ఎండీ అహ్మద్ ఆలీబేగ్, ఎండీ అహ్మదుల్లా, వేణుగోపాల్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



అబ్దుల్ రజాక్‌ను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నాగకుమారి

కార్తికేయుని సన్నిధిలో ప్రముఖులు

మోపిదేవి(అవనిగడ్డ): స్థానిక వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారిని విజయవాడ ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ ఐజీ, ఓఎస్డీ టీవీ శశిధర్ రెడ్డి దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. తానా మాజీ అధ్యక్షుడు తోటకూర ప్రసాద్, సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగశాస్త్రి ఉదయం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసిన వీరు నాగపుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు బుద్దు సతీష్‌శర్మ, వెంకటేశ్వరరావు స్వామివారికి అభిషేకం నిర్వహించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ స్వామివారి లడ్డూ ప్రసాదం అందించి శాలువాకప్పి ఆలయ మర్యాదలతో సత్కరించారు. అనంతరం టేకుపల్లి గ్రామంలోని బాల పార్వతి సమేత రామేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. అక్కడే పాఠశాల ఆవరణలోని అమర గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



స్వామి వారి సన్నిధిలో ప్రసాద్, రామలింగశాస్త్రి

బైజూస్ ట్యాబ్‌ల వినియోగంపై శిక్షణ

నాగాయలంక: మండల విద్యా శాఖ ఆధ్వర్యంలో స్థానిక మండల వనరుల కేంద్రంలో శుక్రవారం బైజూస్ ట్యాబ్‌ల వినియోగంపై మండలంలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎంఈఓ–2 అన్నపరెడ్డి రామారావు అధ్యక్షతన శిక్షణ ఇచ్చారు. సంబంధిత ట్యాబ్‌ల నిర్వహణ, మరమ్మతులకు సంబంధించిన అంశాలపై జిల్లా ట్యాబ్‌ల నిర్వహణ అధికారి ఎండీ దావూద్, శివాజీలు వివరించారు. కార్యక్రమంలో ట్యాబ్ ఇన్‌చార్జి టీచర్లు, హెచ్ఎంలు, సీఆర్‌పీలు, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

కోడూరు: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం వద్ద నిర్వహించిన శిక్షణలో బైజూస్ ట్యాబ్స్, ఐఎఫ్‌పీసీలపై జిల్లా నోడల్ అధికారి మహమ్మద్ దావుద్ అవగాహన కల్పించారు. ట్యాబ్‌లు పగిలిపోయినప్పుడు స్థానిక సచివాలయంలో ఫిర్యాదు చేసి, సంబంధిత రశీదును పొందాలని సూచించారు. ట్యాబ్ పోయినా, చోరీకి గురైనా వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి ఎఫ్ఐఆర్ కాపీని ఉన్నతాధికారులకు అందించాలన్నారు. ఎస్డీ కార్డుకు సంబంధించిన సమస్యలను ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ ద్వారా జిల్లా అధికారులకు తెలిపాలన్నారు. విద్యార్థులంతా ట్యాబ్‌లను సక్రమంగా వినియోగించుకునేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని చెప్పారు. ఎంఈఓలు రామదాసు, శ్రీనివాసరావు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

అవనిగడ్డ: స్టూడెంట్స్‌కి ఇచ్చిన ట్యాబ్స్ వినియోగంలో తలెత్తే సమస్యలు, సద్వినియోగంపై శుక్రవారం ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ట్యాబ్ పగిలిపోయినపుడు, పోయినపుడు, ఎస్డీ కార్డు సమస్య తలెత్తినపుడు, క్యూ ఆర్ కోడ్ స్కానింగ్ సమయంలో తలెత్తిన సమస్యలను ఎలా పరిష్కరించాలో సాంకేతిక సిబ్బంది తెలియజేశారు. కార్యక్రమాన్ని ఎంఈఓ ఎన్. శివశంకరరావు పర్యవేక్షించారు.

విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు

రూ.5.12 లక్షల అపరాధ రుసుం విధింపు

నాగాయలంక: విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నాగాయలంక మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం విస్తృత స్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఉయ్యూరు విద్యుత్ ఈఈ డి.కృష్ణనాయక్ నేతృత్వంలో 32 బృందాలు జరిపిన ఈ తనిఖీల్లో 190 సర్వీసుల్లో అదనపు లోడ్ వాడుతున్నట్లు గుర్తించి సంబంధిత వినియోగదారులపై రూ.5 లక్షల 12 వేలు అపరాధ రుసుం విధించారు. అనంతరం స్థానిక సబ్ స్టేషన్ ఆవరణలోని విద్యుత్ కార్యాలయంలో మండల ఏఈ గొరివర్తి ఏడుకొండలు అధ్యక్షతన సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో పలు అంశాలు చర్చించి సిబ్బందికి సూచనలు చేశారు. తనిఖీల్లో అవనిగడ్డ విద్యుత్ డీఈఈ ఎస్.సుబ్రహ్మణేశ్వరరావు, విజిలెన్స్ డీఈఈ, చల్లపల్లి, డివిజన్ పరిధిలోని సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

● విద్యార్థుల హాజరుపై సచివాలయ సిబ్బంది పర్యవేక్షణ

కోడూరు: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల హాజరుపై సచివాలయంలో విధులు నిర్వహించే వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసుల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని ఎంఈఓ–2 విశ్వనాథపల్లి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద మండలంలోని 11 సచివాలయాల వలంటీర్లు, వెల్ఫేర్, మహిళా పోలీసులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బడిలో చదివే పిల్లలు వరుసగా మూడు రోజుల పాటు పాఠశాలలకు రాకపోతే వారి ఇళ్లకు వెళ్లి వివరాలు తెలుసుకోవాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిపైనే ఉందన్నారు. బయోమెట్రిక్ హాజరు ద్వారా వీటిని పర్యవేక్షించాలని, ఉపాధ్యాయులు కూడా తమకు సహకరిస్తారన్నారు. ఈఓ యలవర్తి సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

● జిల్లా పశుసంవర్ధక శాఖాధికారిగా శ్రీనివాసరావు

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా పశుసంవర్ధక శాఖాధికారిగా దాసరి శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గోపాలపురం ఏడీగా పనిచేస్తున్న శ్రీనివాసరావును పదోన్నతిపై కృష్ణా జిల్లాకు బదిలీ చేశారు. బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావు కలెక్టర్ పి. రాజాబాబును మర్యాదపూర్వకంగా కలిశారు.

● సామూహిక కుంకుమార్చన

కొక్కిలిగడ్డ(మోపిదేవి): కొక్కిలిగడ్డలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామివారి దేవస్థానంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా సామూహిక కుంకుమార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం అమ్మవారికి క్రోవి పార్థసారథి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మహిళలు సామూహికంగా కుంకుమార్చనలో పాల్గొన్నారు.

● టిప్పర్ ఢీకొన్న వ్యక్తి మృతి

అవనిగడ్డ: ఈనెల 5వ తేదీ రాత్రి అవనిగడ్డ సెంటర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి విజయవాడలో చికిత్స పొందుతున్న యలవర్తి నాగరాజు (43) శుక్రవారం మృతిచెందారు. సైకిల్‌పై వెళుతున్న నాగరాజును టిప్పర్ ఢీకొనడంతో ఎడమకాలు నుజ్జునుజ్జయింది. బాధితుడిని విజయవాడ ఆస్పత్రికి తరలించగా కాలు తీసివేశారు. శుక్రవారం ఉదయం గుండెపోటు రావడంతో నాగరాజు మరణించారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

● మండల స్థాయి స్కూల్ గేమ్స్ రేపు

అవనిగడ్డ: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం మండల స్థాయి క్రీడా పోటీలు జరుగుతాయని ఇన్‌చార్జి మునగాల ఉదయ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–14, 17 విభాగాల్లో బాలురు, బాలికలకు కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్ టెన్నికాయిట్, బాల్ బాడ్మింటన్, యోగా, షటిల్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్‌లో పోటీలు జరుగుతాయని చెప్పారు. పాల్గొనదలచిన వారు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు సెల్: 98857 50876, 94945 30568 నంబర్లకు సంప్రదించాలన్నారు.

● భజరంగబలి శతక పుస్తకావిష్కరణ

ఘంటసాల(అవనిగడ్డ): తెలుగు వేదకవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు రచించిన భజరంగబలి శతకం పుస్తకాన్ని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, స్వచ్ఛ చల్లపల్లి రథసారథి డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్–డాక్టర్ పద్మావతి దంపతులు ఆవిష్కరించారు. కృష్ణా జిల్లా ఘంటసాల మండల పరిధిలోని శ్రీకాకుళం శ్రీఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. అష్టావధాని పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, పద్యకవి వామరాజు సత్యమూర్తి పాల్గొని జొన్నవిత్తుల సాహితీ విశేషాలను వివరించారు. శ్రీకాకుళం, అచ్చెంపాలెం సర్పంచ్‌లు రవిప్రసాద్, గాజుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● గ్రామాభివృద్ధికి రూ.25 వేలు విరాళం

చల్లపల్లి: గ్రామ అభివృద్ధి, సుందరీకరణకు నిర్వహిస్తున్న స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమానికి వివేకానందా డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ యార్లగడ్డ శివప్రసాద్ రూ.25 వేలు విరాళం అందించారు. శుక్రవారం స్థానిక సాయినగర్ వద్ద స్వచ్ఛ సుందర చల్లపల్లి 2,875వ రోజు పారిశుద్ధ్య సేవా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శివప్రసాద్ రూ.25 వేల విరాళాన్ని కన్వీనర్ డాక్టర్ డీఆర్కే ప్రసాద్‌కు అందజేశారు.

● భక్తిశ్రద్ధలతో జీవ ధ్వజ మహా సంప్రోక్షణ పూజలు

మచిలీపట్నంటౌన్: గొడుగుపేటలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం జీవ ధ్వజ మహా సంప్రోక్షణ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఘనాపాటి విష్ణుభట్ల సూర్యనారాయణశర్మ బ్రహ్మత్వంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పూర్ణాహుతి జరిగింది. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కేవీ గోపాలరావు, అభివృద్ధి కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

● జాతీయ క్రీడలకు మత్తి అరుణ ఎంపిక

గూడూరు: ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ స్పోర్ట్స్ సెలక్షన్స్‌లో గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ మత్తి అరుణ సత్తా చాటారు. నాగార్జున యూనివర్సిటీలో జరుగుతున్న ఏపీ స్టేట్ లెవల్ సెలక్షన్స్‌లో లాంగ్ జంప్‌లో అరుణ ప్రథమ స్థానం సాధించారు. అలాగే 200 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానంలో నిలిచారు. నవంబరు 22 నుంచి 24 వరకు న్యూ ఢిల్లీలోని నెహ్రూ స్టేడియంలో జరిగే ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ ఆటల పోటీలకు ఆమె ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ చూపిన అరుణను పలువురు అభినందించారు.

● వృద్ధులను గౌరవించాలి

మచిలీపట్నంటౌన్: చిన్నతనం నుంచే పిల్లలకు వృద్ధులను గౌరవించడం నేర్పించాలని నెల్లూరు రవీంద్రభారతి స్కూల్ ప్రిన్సిపాల్ సీతామహాలక్ష్మి అన్నారు. సుకర్లాబాద్‌లోని రవీంద్రభారతి స్కూల్‌లో శనివారం గ్రాండ్ పేరెంట్స్ డే నిర్వహించారు. విద్యార్థులు వారి మామ, తాతయ్యల కాళ్లు కడిగారు. మామ్మ, తాతయ్యలు చిన్నారులను ఆశీర్వదించారు.